ఆంధ్రజ్యోతి

14 హైదరాబాద్ • మంగళవారం 18 మార్చి 2025

# యూజీసీ నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాజ్యం

- డీమ్డ్ యూనివర్సిటీల్లో మా పాత్ర లేకుండా చేశారు
- వాటిని మూసేస్తే ఎవరిది బాధ్యత?.. ప్రశ్నించిన సర్కారు

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జారీ చేసిన నూతన నిబంధనలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నూతన నిబంధనల ప్రకారం అనుమతి పొందిన డీమ్డ్ టు బీ యూనివర్సిటీలు భవిష్యత్తులో మూతపడితే ఆ బాధ్యత ఎవరు వహిస్తారని, విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీగా ఉంటారని ప్రశ్నించింది. యూజీసీ ఇన్‌స్టిట్యూషన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీస్ రెగ్యులేషన్స్ - 2023లోని 2 (15), 6, 7, 8, 29, 30 తదితర నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, యూజీసీతోపాటు ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలైన అరోరా హయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీ, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, సింబయాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీ, విజ్ఞాన్ ఫౌండేషన్ తదితర యూనివర్సిటీలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డీమ్డ్ యూనివర్సిటీలు, వాటి ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో చిన్న చిన్న దుకాణాలు, షెడ్లలో కూడా కాలేజీలు నడిపించారని, వాటిపై నియంత్రణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్రం, యూజీసీలకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

మంగళవారం । 18 । మార్చి । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు

- ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం
- పరిపాలనలో గందరగోళం తొలగించేందుకే అన్న సీఎం
- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన
- వ్యతిరేకించిన బీజేపీ.. ఓయూకు సురవరం పేరు పెట్టాలని సూచన



సాక్షి, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు సోమవారం శాసనసభ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి పక్షాన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టడానికి కారణాలపై సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటన చేశారు. తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ సహా పలువురు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు.

### పొట్టి శ్రీరాములును తక్కువగా చూడటం లేదు

పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటం లేదు. వారి ప్రాణ త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలి. పరిపాలనలో భాగంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నాం. రాష్ట్ర పునర్విభజన తర్వాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే కొందరు కొన్ని వర్గాల్లో అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరుండేది. రాష్ట్ర విభజన తర్వాత ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏపీకి వెళ్లగా తెలంగాణలో హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం. ఇది ఎన్టీఆర్‌ను అగౌరవపరిచినట్టు కాదు. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం. వైఎస్ పేరుతో ఉన్న హార్టీకల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఇదే కోవలో తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టుకున్నాం.

### వ్యక్తులను అగౌరవ పరిచేందుకు కాదు..

ఏపీలో ఆ పాత పేర్లతో యూనివర్సిటీలు, సంస్థలు కొనసాగనున్నందున తెలంగాణలో కూడా అవే పేర్లతో ఉంటే పరిపాలనలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉన్నందున మార్చుకుంటున్నాం. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్న కొందరు కులాన్ని ఆపాదిస్తున్నారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవటం తప్పు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియంకు ఆయన పేరు తొలగించి నరేంద్ర మోదీ పేరు పెట్టారు. మేం అలాంటి తప్పిదాలు చేయలేదు..'అని రేవంత్ చెప్పారు.

### నేచర్‌క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు

'మాకు ఆర్యవైశ్యులపై, పెద్దలు పొట్టి శ్రీరాములుపై అపార గౌరవం ఉంది. ఆయన త్యాగాలు, ఆయన దేశభక్తిని సమున్నతంగా స్మరించుకునేలా.. ఇటీవలే ఘనంగా ప్రారంభించుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఆయన పేరు పెట్టుకుందాం. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖ రాస్తా. ఇక మాజీ సీఎం కె.రోశయ్య ఇంటికి చేరువలోనే ఉన్న ప్రభుత్వ నేచర్ క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు పెట్టడంతో పాటు ఆవరణలో ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తాం. ఇక సురవరం ప్రతాపరెడ్డి మహనీయుడు. తెలంగాణలో కవులు లేరు అంటూ అపహాస్యం చేసిన పరిస్థితిలో 354 మంది ఉద్దండ కవులతో సమావేశమై గోల్కొండ పత్రికలో వారి ప్రతిభకు పట్టం కట్టి తెలంగాణ కవుల గొప్పదనాన్ని చాటారు. నిజాంకు వ్యతిరేకంగా గొప్పగా పోరాడిన ధీశాలి..'అని సీఎం వివరించారు.

## తెలుగుజాతి త్యాగాన్ని అవమానించడమే: బీజేపీ

తెలుగు వర్సిటీ పేరు మార్పును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. 'పొట్టి శ్రీరాములు ఓ ప్రాంత నేత కాదు. ఆయన గాంధీజీతో కలిసి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విముక్తి కోసం ప్రాణత్యాగం చేశారు. అలాంటి మహనీయుడి పేరును తొలగించటం అంటే తెలుగు జాతి త్యాగాన్ని అవమానపరచటమే. సురవరం ప్రతాపరెడ్డి పేరును.. నిజాంకు గుర్తుగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ పేరును మార్చి దానికి పెట్టాలి..'అని బీజేపీ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అహ్మదాబాద్‌లోని స్టేడియానికి సర్దార్ పటేల్ పేరును తొలగించారన్న ఆరోపణ సరికాదని, స్టేడియం ప్రాంగణానికి ఆయన పేరే ఉందని, అక్కడి క్రికెట్ గ్రౌండ్‌కు మాత్రమే నరేంద్ర మోదీ పేరు పెట్టారని ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

## ఇష్టారాజ్యంగా 'డీమ్డ్' ఇవ్వడంపై స్టే ఇవ్వండి

### హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు విద్యా సంస్థలకు ఇష్టారాజ్యంగా డీమ్డ్ యూనివర్సిటీ హోదా ప్రకటించడం సరికాదని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలపై స్టే విధించాలని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇలాంటి వర్సిటీలతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఇరుపక్షాల వాదనలు వినకుండా స్టే ఇవ్వలేమని సీజే ధర్మాసనం తేల్చిచెప్పింది. యూజీసీ సహా రాష్ట్రంలోని ఏడు డీమ్డ్ యూనివర్సిటీలకు నోటీసులు జారీ చేసింది. అరోరా ఉన్నత విద్య– పరిశోధన అకాడమీ, చైతన్య, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, కేఎల్ విశ్వవిద్యాలయం (అజీజ్‌నగర్, బౌరంపేట్ క్యాంపస్‌లు), సింబయాసిస్ ఇంటర్నేషనల్, విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ 15 రోజులకు వాయిదా వేసింది. 2010, 2016, 2019లో యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అధికార పరిధిని ఉల్లంఘించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా డీమ్డ్ యూనివర్సిటీగా ప్రకటించడాన్ని తప్పుబట్టింది. అలాగే, యూజీసీ నిబంధనలపై స్టే ఇవ్వాలంటూ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఈ ఐఏపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

మంగళవారం 18 మార్చి 2025 నవతెలంగాణ

# తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు

## ఉభయ సభల్లో బిల్లు ఆమోదం

### బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు.. వ్యతిరేకించిన బీజేపీ

### చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టండి : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభలో కీలక బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చింది. దీనికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా నామకరణం చేసింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చాలంటూ ...5 లో

# తెలుగు విశ్వవిద్యాలయానికి 'సురవరం' పేరు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. శాసనమండలిలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించగా, శాసనసభ, శాసనమండలిలో ఈ అంశంపై పలువురు సభలో మాట్లాడారు. ఆ తర్వాత బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వైతాళికుడన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టడం సముచితమని తెలిపారు. తెలుగు భాష పరిరక్షణ, వెట్టిచాకిరీ కోసమే 1930లో ఆంధ్రమహాసభ ఏర్పడిందనీ, అందులో సురవరం కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మాత్రం ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలనీ, బదులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని ఆ పార్టీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ వ్యాఖ్యలను ఎంఐఎం సభ్యులు బలాల తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోందనీ, పార్లమెంటులో అంబేద్కర్ చిత్రపటాన్ని బీజేపీ తొలగించిందనీ, గుజరాత్ సర్దార్ వల్లభాయ్ స్టేడియానికి



మోడీ పేరు పెట్టారని విమర్శించారు. దీనిపై మండలిలో కాంగ్రెస్ సభ్యులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, బీఆర్ఎస్ సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం ఈ బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి.

### భౌగోళిక ప్రాంతాన్ని ప్రతిబింబించేలా 'సురవరం ప్రతాపరెడ్డి పేరు' : రేవంత్‌రెడ్డి

భౌగోళిక ప్రాంతాన్ని ప్రతిబింబించేలా తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక ప్రాంతంలో ఉన్నవి ఆంధ్రా ప్రాంతానికి, తెలంగాణలో ఉన్నవి ఈ ప్రాంతానికి కేటాయించారని గుర్తు చేశారు. అందులో భాగంగా పేర్లు మార్చుకోవడం జరుగుతోందని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆంధ్రాకు వెళ్లిందనీ, తెలంగాణ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు పేరు పెట్టుకున్నారని తెలిపారు. దీనికి అర్థం ఎన్టీఆర్‌పై గౌరవం లేనట్టు కాదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పేరును మార్చుకోవడంలో భాగంగా ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీకి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ పేరును పెట్టారని తెలిపారు. ఉద్యాన యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారని తెలిపారు. కొత్తగా ఏర్పడిన యూనివర్సిటీలకు పేర్లు మార్చుకోవడం సహజమని అన్నారు. తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నరసింహారావు పేరును, అదే కోణంలో తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం సముచితం అని తెలిపారు. తెలుగు యూనివర్సిటీకి ఆంధ్రాలో పొట్టి శ్రీరాములు పేరు కొనసాగుతోందన్నారు. ప్రతాపరెడ్డి సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణకు అసలు భాషనే లేదని వెక్కిరించిన రోజుల్లో ఆయన గోల్కొండ పత్రికను ప్రారంభించి కవులను ఏకతాటిపైకి తెచ్చి నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సురవరం సేవలు మరువలేనివనీ, అందుకే ఆయన పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టడం సముచితమన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను ఎవరూ తక్కువ చేయడం లేదన్నారు. గాంధీ ఆదర్శాలతో ప్రాణత్యాగంతో మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన త్యాగం చేశారన్నారు. అదే సందర్భంలో తెలంగాణ వైతాళికులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలని కూనంనేని సాంబశివరావు గతంలో సూచించారని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. 2014 పునర్విభజన తర్వాత తెలంగాణకు కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు వచ్చాయనీ, పరిపాలన, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ఆయన పేరును ఒక కులానికి ఆపాదించడం సరైందికాదన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామని, అందుకోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి లేఖ రాస్తానన్నారు. బల్కంపేట్ నేచర్‌క్యూర్ ఆస్పత్రికి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రోశయ్య పేరు పెట్టడంతోపాటు అక్కడి సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని పెడతామని తెలిపారు. పేరు మార్పును రాజకీయం చేయడం తగదని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు విషయంలో మతపరమైన రాజకీయాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరైనవి కావని చెప్పారు.